











'జగనన్న సురక్ష'తో అందరికీ సంక్షేమ ఫలాలు



చింతలవల్లిలోలో ధ్రువీకరణ పత్రాల పంపిణీ

ముసునూరు: జగనన్న సురక్ష కార్యక్రమంతో సంక్షేమ ఫలాలు అందరికీ పూర్తిగా అందుతున్నాయని వైస్ ఎంపీపీ కె.రాజానాయన, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. జగనన్న సురక్ష మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన శుక్రవారం చింతలవల్లిలో జగనన్న సురక్ష గ్రామ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక లబ్ధిదారులకు 1,166 ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హతలు కలిగి ఉండి పథకాలు పొందలేకపోయిన వారికి న్యాయం చేస్తామన్నారు. జగనన్న సురక్ష గ్రామ శిబిరం గుర్తుగా నూతన సచివాలయ ప్రాంగణంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కొబ్బరి మొక్కలు నాటారు. సర్పంచ్ సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగ వల్లేశ్వరరావు, తహసీల్దార్ దాసరి సుధ, డీటీ ఎమిలీ కుమారి, ఈఓపీఆర్డీ సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్హత ఉంటే పథకాల మంజూరు

చాట్రాయి: అర్హత ఉంటే సంక్షేమ పథకాలు మంజూరు చేయడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి స్పష్టం చేశారు. కోటపాడు సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని పేర్కొన్నారు. అనంతరం 11 రకాల సేవలకు సంబంధించి 384 మందికి ఉచితంగా ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పరసా సత్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ పుచ్చకాయల సుబ్బారెడ్డి, ఎంపీడీఓ దుర్గాప్రసాదు, తహసీల్దార్ విశ్వనాథరావు, మండల ప్రత్యేక అధికారి నెహ్రూబాబు, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ బ్రహ్మాచారి, ఈఓపీఆర్‌డీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో జడ్జి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న 15వ అదనపు జిల్లా జడ్జి నాగశైలజ

నూజివీడు: ఈనెల 22న ప్రత్యేక లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో నూజివీడు 15వ అదనపు జిల్లా జడ్జి ఏ నాగశైలజ శుక్రవారం కోర్టు హాలులో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంవీఓపీ కేసుల సెటిల్‌మెంట్ గురించి ఈ సమావేశంలో చర్చించారు. సాధ్యమైనన్ని ఎంవీఓపీ కేసుల పరిష్కారానికి ఇన్సూరెన్స్ కంపెనీలు సహకరించాలని ఈ సందర్భంగా నాగశైలజ పేర్కొన్నారు. సమావేశంలో స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, సీనియర్ న్యాయవాదులు జీ నీలాంబరం, కేజే డిక్సన్, వాకా రాజకుమార్, బసవరాజు రామకృష్ణ, వీ నరసింహారావు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ఆగిరిపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు

ఆగిరిపల్లి(నూజివీడు): దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటి పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యాప్తి నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని నూజివీడు మలేరియా సబ్‌యూనిట్ అధికారి యలమంద అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆగిరిపల్లిలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. వీటి నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం ప్రతి ఇంటి పరిసరాల్లో డ్రై డే పాటించాలన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రజా ప్రతినిధులు

చాట్రాయి: మండల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ లంకా నిర్మల అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులకు అందజేయాలన్నారు. ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అనూషా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, ఎంపీడీఓ దుర్గా ప్రసాదు, పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రేపు వాసవీక్లబ్ జోనల్ సమావేశం

తిరువూరు: వాసవీ క్లబ్ జోనల్ సమావేశం ఈ నెల 9న సాయంత్రం ఐదు గంటలకు తిరువూరు ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో నిర్వహించనున్నట్లు జోనల్ చైర్‌పర్సన్ వెంకట రామారావు తెలిపారు. క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ దస్తగిరి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేస్తారని పేర్కొన్నారు. గత ఏడాది కాలంలో వాసవీ క్లబ్ చేసిన కార్యక్రమాలపై ఈ సమావేశంలో సమీక్షించి సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉన్న క్లబ్బులకు బహుమతులందజేస్తామని తెలిపారు.

నేడు వైఎస్సార్ జయంత్యుత్సవం

నూజివీడు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పట్టణంలోని చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో శనివారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇందులో భాగంగా ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కేక్ కట్ చేస్తారని పేర్కొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంత్యుత్సవాన్ని శనివారం ఉదయం తొమ్మిది గంటలకు చాట్రాయిలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మిద్దె బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు ఎమ్మెల్యే రక్షణనిధి పర్యటన

విస్సన్నపేట: మండలంలోని వేమిరెడ్డిపల్లి పంచాయతీ నర్మదానగరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి శనివారం ఉదయం 10 గంటలకు వస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని పేర్కొన్నారు.

తిరుపతమ్మకు ఆషాఢ సారె

విస్సన్నపేట: స్థానిక సత్తుపల్లి రోడ్డులో ఉన్న గోపయ్య సమేత తిరుతమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి ఆషాఢ సారెను కమ్మటూరు మహిళలు శుక్రవారం అందజేశారు . కమ్మటూరు రామాలయం నుంచి నడుచుకుంటూ తిరుపతమ్మ అమ్మవారికి సారె తీసుకెళ్లారు. పొంగళ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గంపలగూడెం: మండలంలో శనివారం ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ సబ్ ఇంజినీర్ కొమ్ము వాసు ఒక ప్రకటనలో తెలిపారు. గంపలగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

అపర భగీరథుడు వైఎస్సార్

మైలవరం: అపర భగీరథుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహానేత వైఎస్సార్ జయంతి కార్యక్రమం మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. తాను స్థానికంగా అందుబాటులో లేని కారణంగా మహానేత వైఎస్సార్ జయంతి కార్యక్రమానికి ఈ ఏడాది హాజరు కాలేకపోతున్నట్లు తెలిపారు. తాను అందుబాటులో లేకున్నా మైలవరం నియోజకవర్గం వ్యాప్తంగా వైఎస్సార్ జయంతిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని సీడీపీఓ సత్యవతి తెలిపారు. ఏకొండూరు మండలం వెంకటతండాలో సహాయకురాలి పోస్టు ఎస్టీలకు, గంపలగూడెం మండలం గోసవీడు–1, గంపలగూడెం–4 కేంద్రాల్లో సహాయకుల పోస్టులకు బీసీ బీ మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీలోపు అన్ని ధ్రువీకరణపత్రాలు జతచేసిన దరఖాస్తులను తిరువూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ఇబ్రహీంపట్నం: ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం స్థానిక శక్తినగర్‌లో ఆ సంఘ ప్రతినిధులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. వార్డు కౌన్సిలర్ నల్లమోతు లక్ష్మీ కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం నుంచి సామాజిక న్యాయం కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు. మండల అధ్యక్షుడు మొండితోక విజయ్ మాదిగ, నల్లమోతు రవి, కారుమంచి దుర్గారావు, కంచర్ల రాజేష్, కొమ్ముకూరి రవిబాబు పాల్గొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం నిర్వహించారు. కొణిజెర్ల, ఊటుకూరు, పెనుగొలను గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జెండాను నాయకులు ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు పోరాట కొనసాగిస్తామని పలువురు పేర్కొన్నారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కృష్ణమాదిగ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మైకేల్ , బాబురావు, నాగర్జన, రామారావు, శివశంకర్ పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘ నాయకులు శుక్రవారం నిర్వహించారు. వెలగలగూడెం గ్రామ సెంటర్లో నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మల్లాది వీరయ్య మాట్లాడారు. అనంతరం కొత్తనాగులూరు కాలనీ నుంచి వెలగలగూడెం సెంటర్ వరకు యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల సమన్వయకర్త మందా వెంకటేశ్వరరావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు పోరాటం

రాయనపాడు(విజయవాడరూరల్): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జరిగే ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తూనే ఉంటుందని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి మందా వెంకటేశ్వరావు మాదిగ అన్నారు. రాయనపాడు గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందా కృష్ణమాదిగ జన్మదిన వేడుకలు శుక్రవారం జరిగాయి. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కె.రవికుఆమర్, ఎం.వెంకటేశ్వరావు పాల్గొన్నారు.















అంకమ్మకు వెండి మల్లెపూల హారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక నేతాజీ కాలనీలోని శ్రీఅంకమ్మ శక్తిపీఠంలో అమ్మవారికి శుక్రవారం అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన నాగలక్ష్మి రూ.32 వేల విలువైన వెండి మల్లెపూల హారాన్ని సమర్పించారు. శక్తిపీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి వెండి మల్లెపూల హారం అలంకరించారు. అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

శ్యామలాంబదేవికి సారె సమర్పణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీలోని శ్రీ శ్యామలాంబదేవికి శుక్రవారం కాలనీలోని మహిళలు సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు మేళతాళాలు డప్పు వాయిద్యాలతో సారె ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళలు నాగలక్ష్మి, అనసూయ మాట్లాడుతూ అమ్మవారికి ఏటా సారె సమర్పిస్తున్నామన్నారు. ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు, ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

'జగనన్న సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్



ప్రజలతో మాట్లాడుతున్న జేసీ సంపత్‌కుమార్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్ అన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందించాలన్నదే ప్రభుత్వం ధ్యేయమన్నారు. అర్హత ఉన్నా పలు కారణాలతో లబ్ధి అందనివారు జగనన్న సురక్ష క్యాంపుల్లో అవసరమైన ధ్రువపత్రాలను పొందవచ్చన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో నిర్వహిస్తున్న క్యాంపుల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో విజయవాడ రూరల్ తహసీల్దార్ జాహ్నవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గణితం అధ్యయనంతో ఉన్నత శిఖరాలు



ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రిటైర్డ్ ఉన్నతాధికారి జొన్నలగడ్డ రాజేంద్రకు సత్కారం

గుణదల(విజయవాడ తూర్పు): గణితశాస్త్రాన్ని కష్టపడి, ఇష్టపడి అధ్యాయనం చేస్తే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని లయోల కళాశాల పూర్వవిద్యార్థి, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రిటైర్డ్ ఉన్నతాధికారి జొన్నలగడ్డ రాజేంద్ర అన్నారు. గణిత శాస్త్రం ప్రాముఖ్యతపై ఆంధ్ర లయోల కళాశాలలో శుక్రవారం అతిథి ఉపన్యాసం జరిగింది. రాజేంద్ర మాట్లాడుతూ దేశభక్తి, మానవతా విలువలను నేటి విద్యార్థులు నేర్చుకోవాలని సూచించారు. లయోల కళాశాల విద్యార్థులుగా సమాజ సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. అనంతరం రాజేంద్రను కళాశాల యాజమాన్యం శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల రెక్టర్ ఫాదర్ బాలశౌరి, ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ప్రభుదాస్, ఫాదర్ కిరణ్‌కుమార్, గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పరుచూరి వేణుగోపాలరావు, అధ్యాపకులు డాక్టర్ తబిత, కె.నాగకోటేశ్వరరావు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు సత్కారం



ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ డివిజన్ మహిళ సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ జయ మోహన్ అధ్యక్షతన రోజువారి విధుల్లో అత్యుత్తమ సేవలు అందించిన 100 మంది రైల్వే ఉద్యోగులను ఘనంగా సత్కరించి అభినందించారు. శుక్రవారం విజయవాడ రైల్వే ఆడిటోరియంలో సంక్షేమ సంఘం ఉపాధ్యక్షురాలు డాక్టర్ శారద శ్రీకాంత్‌తో కలసి జయ మోహన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జయ మోహన్ మాట్లాడుతూ భారతీయ రైల్వేలో మహిళ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో నిబద్ధతతో ప్రజలకు, ప్రయాణికులకు, ఉద్యోగులకు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ సంఘం చేసే ప్రతి సేవలో తమ విలువైన సహకారం అందిస్తున్న పలు విభాగాల అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ శరద శ్రీకాంత్ మాట్లాడుతూ తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేరీర్ ఈ-వరల్డ్ సంస్థ నుంచి తమ విద్యార్థులు ఈ-సెట్‌లో ర్యాంకులు సాధించడానికి కృషి చేసిన ఫ్యాకల్టీని సత్కరించారు. కార్యక్రమంలో విజయవాడ డివిజన్ పీఆర్‌ఓ నుస్రత్ మండ్రూప్కర్, ఈ-వరల్డ్ సెక్రటరీ గాయత్రి, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

టమాటాల స్టాల్ ప్రారంభం



పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలుదారుల సౌకర్యార్థం సబ్సిడీపై రూ.50కే కిలో టమాటాలు విక్రయించే స్టాల్‌ను 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి ప్రారంభించారు. శుక్రవారం పాయకాపురంలోని రైతుబజారులో ఏర్పాటు చేసిన టమాటాల స్టాల్ కొనుగోలుదారులకు అందుబాటులోకి వచ్చింది. వైఎస్సార్ సీపీ డివిజన్ కోఆర్డినేటర్ కె.వీరబాబు, పార్టీ నాయకులు అలంపూరు విజయ్, బోరా బుజ్జి, రామిరెడ్డి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్ మీటర్లు

నున్న(విజయవాడరూరల్): జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ మీటర్లు అందజేస్తుందని డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీరు బాలాజీనాయక్ తెలియజేశారు. నున్న గ్రామంలో శుక్రవారం జగనన్న కాలనీలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కొద్దిసేపు మాట్లాడారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం 2,500 రూపాయల విలువ చేసే ఎంసీడీ బోర్డు(విద్యుత్ మీటర్లు, వైరు) ఉచితంగా అందజేస్తుందన్నారు. ఇప్పటివరకు నున్న సబ్‌స్టేషన్ పరిధిలో 460 మంది లబ్ధిదారులకు విద్యుత్ మీటర్లను ఉచితంగా అందజేశామన్నారు. ఇంకా కావాల్సిన వారు ఆధార్ కార్డు, ప్లాటు నెంబరు వివరాలతో స్థానిక అధికారిని సంప్రదించవచ్చునని తెలియజేశారు. జగనన్న కాలనీల కోసం నున్న(శాంతివనం), సూరంపల్లి గ్రామాల్లో 33/11కేవీ సామర్థ్యంగల విద్యుత్ సబ్‌స్టేషన్లు నిర్మించామన్నారు. వ్యవసాయ కనెక్షన్లు తీసుకునే రైతులకు మూడు స్తంభాల వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే రైతులకు త్వరితగతిన కనెక్షన్లు ఇస్తున్నామన్నారు.

వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కేసు నమోదు

పెనమలూరు: దురలవాట్లకు బానిసగా మారిన భర్త భార్యను వేధిస్తుండటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిగడప టీచర్స్ కాలనీకి చెందిన ఎ.సౌమ్య 2010 సంవత్సరంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న రవికుమార్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సందర్భంగా కట్నకానుకలు ఇచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు పుట్టారు. అయితే భర్త అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో ఆమె గత కొద్ది కాలంగా వేరేగా పిల్లలతో ఉంటుంది. భర్త భార్య ఉంటున్న ఇంటి వద్దకు వెళ్లి బెదిరిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు భర్త పై కేసు నమోదు చేశారు.

నేడు గిరిపురంలో మెగా వైద్యశిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని శనివారం గిరిపురంలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు 24 డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో సీతారామపురంలోని దీపక్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి వైద్యులు పరీక్షలు చేయనున్నారని పేర్కొన్నారు. జనరల్ చెకప్, బీపీ, షుగర్ నిర్ధారణ, ఈసీజీ వంటివి ఉచితంగా చేయనున్నట్లు వివరించారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. ఆస్పత్రిలో వైద్యం అవసరమైన వారికి రాయితీపై చేయడానికి చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. గిరిపురం, కస్తూరిబాయిపేట ప్రాంతాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి

పెనమలూరు: కార్పొరేట్, ప్రైవేటు కాలేజీల ఫీజుల దోపిడీని ప్రభుత్వం అడ్డుకుని పేద, మధ్య తరగతి విద్యార్థులకు న్యాయం చేయాలని పీడీఎస్‌యు నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.వైష్ణవ్, ఆర్. వేణు అన్నారు. కానూరులో ఇంటర్మీడియెట్ ఆర్ఐవో కార్యాలయంలో ఏవో అరుణకు వినతిపత్రం ఇచ్చి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు నేతలు వివరాలు తెలుపుతూ రాష్ట్రంలో 439 ప్రభుత్వ, 131 ఎయిడెడ్ కాలేజీల్లో 70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు చదువుతున్నారన్నారు. కాలేజీలో ఇష్టానుసారంగా ఫీజులు వసూళ్లు చేసి విద్యార్థులపై భారం మోపుతున్నారని ఆరోపించారు. కాలేజీల్లో కనీస వసతులు కూడా ఉండటం లేదన్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, ఫీజులు నియంత్రణ చేయాలని డిమాండ్ చేశారు. కాలేజీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టుల భర్తీ చేయాలని కోరారు. ఏఈఈ, నీట్ పేరుతో కార్పొరేట్ కాలేజీలు చేస్తున్న దోపిడీపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎస్‌యు నేతలు మోహన్, భరత్, జస్వంత్, చంద్ర పలువురు పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారికి శాకంబరి అలంకరణ

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో లాకుల వద్ద వేంచేసి ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఆషాఢ మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో కనకదుర్గ అమ్మవారికి వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లతో శాకంబరి అలంకరణ చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు నున్నలో డీపీఓ కార్యాలయ ఉద్యోగుల సమావేశం

విజయవాడరూరల్: రాష్ట్రంలో జిల్లా పంచాయతీ కార్యాలయాల ఉద్యోగుల సమావేశం శనివారం నున్న గ్రామంలో జరుగుతుందని ఉద్యోగుల రాష్ట్ర సంఘం అసోసియేట్ ప్రెసిడెంటు సీతారామయ్య తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల జిల్లా పంచాయతీ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

నూజివీడు డిపో అభివృద్ధిపై ఎమ్మెల్యే చర్చ



నూజివీడు: విజయవాడలో ఆర్టీసీ ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శుక్రవారం సమావేశమై పలు అంశాలపై చర్చించారు. నూజివీడు డిపో అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడారు.

మూడోరోజు కొనసాగిన సర్టిఫికెట్ల పరిశీలన



నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో 2023–24 విద్యాసంవత్సరానికి ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశానికి సంబంధించి ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్లను శుక్రవారం పరిశీలించారు. దీనిలో భాగంగా ఎన్‌సీసీ కేటగిరి సంబంధించి 322 మంది సర్టిఫికెట్లను, మాజీ సైనికుద్యోగుల కోటాకు సంబంధించి 60 మంది, క్రీడా కోటాకు సంబంధించి 150మంది అభ్యర్థులు హాజరైనట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య గోపాలరాజు తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి సందర్శించారు. వెరిఫికేషన్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. నూజివీడు డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, ఏఓ ప్రదీప్, చీఫ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ భాను కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా పండరిసాయి ఆలయ వార్షికోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేటలోని శ్రీ పండరిసాయి మందిర చతుర్థ వార్షికోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. తెల్లవారుజామున సుప్రభాత సేవతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం పంచామృతాభిషేకం చేశారు. ప్రత్యేక అలంకారంలో బాబా భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీగణపతి హోమం జరిగింది. స్వామి వారికి మారేడు దళార్చన చేశారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త నాగోతి వెంకటరామకృష్ణ పర్యవేక్షించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నగరానికి చెందిన వర్షిణి బృందంలోని పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇవ్వగా భక్తులను అలరించింది.

యువతి అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): షాపునకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పంజాలోని గాంధీబొమ్మ సెంటర్‌కు చెందిన ఓ యువతి చిట్టూరి కాంప్లెక్స్‌లోని ఓ ఫ్యాన్సీ షాపులో పని చేస్తుంటుంది. గురువారం ఉదయం షాపునకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిన యువతి తిరిగి రాలేదు. దీంతో శుక్రవారం ఉదయం షాపు యజమానితో మాట్లాడగా గత నెల 27న జీతం తీసుకుని ఆ యువతి మానేసిందని చెప్పాడు. పలుచోట్ల వెదికినా ఫలితం లేకపోవడంతో తల్లి నజీమ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆస్తి పత్రాలు లాక్కెళ్లారంటూ ఆడపడుచుపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బలవంతంగా ఇంట్లో ఉన్న ఆస్తి పత్రాలను లాక్కెళ్లిన ఆడపడుచు, ఆమె భర్తపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి కాలనీకి చెందిన కోనేరు శ్రీదేవి, దుర్గా మల్లేశ్వరరావు భార్యభర్తలు. 2014లో శ్రీదేవి ఉంగటూరులో ఉంటున్న తన ఆడపడుచు పొలంలో 20 సెంట్లు కొనుగోలు చేశారు. అయితే 2019 నుంచి ప్రభుత్వం నుంచి వస్తున్న రైతు భరోసాకు ఆడపడుచు భర్త దేవరకొండ కోటేశ్వరరావు తన బ్యాంక్ ఖాతా నెంబర్ ఇవ్వడంతో ఆ నగదు వారి ఖాతాలో జమ అవుతున్నాయి. ఇటీవల శ్రీదేవి గ్రామానికి వెళ్లగా అక్కడ వలంటీర్ ద్వారా విషయం తెలుసుకుని నిలదీశారు. దీంతో దాడికి పాల్పడటమే కాకుండా శ్రీదేవి తండ్రి వద్ద ఉన్న పొలం పత్రాలను బలవంతంగా లాక్కున్నారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పాడి పశువుల పోషణ మెలకువలపై సదస్సు

గన్నవరం: పాడి పశువుల పోషణను లాభసాటిగా మార్చుకునేందుకు సరైన యాజమాన్య పద్ధతులను పాటించాలని ఎన్టీఆర్ పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి. శ్రీదేవి సూచించారు. కళాశాలలో పశుపోషణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పాడి పశువుల పోషణలో మెలకువలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పశుపోషణ విభాగాధిపతి డాక్టర్ కె.రాజకిషోర్ అధ్యక్షతన డాక్టర్ పి.కవిత, డాక్టర్ వెంకటశేషయ్య, డాక్టర్ ఎస్. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాపత్రయమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని బోర్వంచలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రతాప్ 675 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నాలుగేళ్ల పాలనలో రాజకీయాలకు, కుల, మతాలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప పేదలకు చేసింది శూన్యమని ధ్వజమెత్తారు. కరోనాతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నా సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందన్నారు. గ్రామగ్రామాన సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రభుత్వ పాలనను ప్రజల గడప వద్దకు తీసుకొచ్చారన్నారు. విద్యకు, వైద్యానికి ప్రాధాన్యం ఇచ్చి ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ వైద్యశాలలను వందల కోట్లు వెచ్చించి అభివృద్ధి చేయడంతో పాటు వైద్యులను నియమించారన్నారు. ప్రతి గ్రామంలో వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి అక్కడ మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌ను నియమించడంతో పాటు 105 రకాల మందులను ప్రజలకు అందుబాటులో ఉంచిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు మండలానికి ఇద్దరు ఎంఈఓలను నియమించిందన్నారు. రాబోయే ఎన్నికల్లో కూడా ప్రజలు చంద్రబాబును ఓడించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి ఎస్ రామ్మోహన్ రావు, తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు, ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్ కృష్ణంరాజు, ఎంపీపీ శిరీష, సర్పంచ్ ఉదయరాజు పాల్గొన్నారు.

మాజీ మంత్రి చనమోలు సేవలు చిరస్మరణీయం



మైలవరంలో మాజీ మంత్రి వెంకట్రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఇబ్రహీంపట్నంలో వెంకటరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



జి.కొండూరులో వెంకట్రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మైలవరం: మైలవరం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చనమోలు వెంకట్రావు నియోజకవర్గానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. చనమోలు వెంకట్రావు వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు శుక్రవారంనిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు జీ వెంకట్రావు, పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ షేక్ రహీమ్, సర్పంచ్ గరికపాటి మంజుభార్గవి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: మాజీ మంత్రి చనుమోలు వెంకటరావు సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, పీఏసీఎస్ చైర్మన్ మునగాల సాంబ శివారెడ్డి అన్నారు. చనుమోలు వెంకటరావు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, సచివాలయాల కోఆర్డినేటర్ లంకే అంక మోహనరావు కౌన్సిలర్లు శ్రీనివాస్, లక్ష్మీ, చిన్నయ్య, భూశంకరరావు, రాము నివాళులర్పించారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: చనుమోలు వెంకట్రావు వర్ధంతిని జి.కొండూరులో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వేములకొండ సాంబశివరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. పులివాగు పక్కన ఉన్న వెంకట్రావు విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమానికి వెంకట్రావు కుమారుడు చనుమోలు బాబ్జి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, జి.కొండూరు, కవులూరు, కుంటముక్కల పీఏసీఎస్‌ల చైర్మన్లు రాంబాబు, ఓంకార్‌బాబు, మధుబాబు పాల్గొన్నారు.

మైనార్టీల బాంధవుడు సీఎం వైఎస్ జగన్



కె.తాడేపల్లి మసీదు వద్ద కరపత్రాలు అందజేస్తున్న షేక్ గౌస్ మొహిద్దీన్

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): మైనార్టీలకు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ, మైనార్టీల ఆచార వ్యవహారాలకు సంబంధించిన కార్యక్రమాలకు సహకరిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీల బాంధవుడని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారీలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రచార కార్యక్రమం హర్ దిల్ మే వైఎస్సార్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొత్తూరు తాడేపల్లిలో మజిద్ బిలాల్ వద్ద స్థానిక ముస్లిం పెద్దలు, మసీదు బాధ్యులతో సమావేశమయ్యారు. తొలుత మసీదులో జుహర్ నమాజును ఆచరించారు. అనంతరం జరిగిన సమావేశంలో వక్ఫ్‌బోర్డు చైర్మన్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబాటుకు గురైన ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది రూపాయలు మేలు జరిగిందన్నారు. మైనార్టీల ఆచార వ్యవహారాలకు సంబంధించిన పవిత్ర హజ్ యాత్రకు ప్రభుత్వం చేసిన కృషి మరువలేనిదన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనార్టీలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, మైనార్టీల బాంధవుడిగా నిరూపించుకున్నారని పేర్కొన్నారు. హర్ దిల్ మే వైఎస్సార్ కరపత్రాలను పంపిణీ చేశారు. సమావేశంలో మసీదు ప్రెసిడెంటు మొఘల్ హుస్సేన్‌బేగ్, సెక్రటరీ సయ్యద్ జాకీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

రూ.కోటితో అంతర్గత రహదారుల అభివృద్ధి



పెనమలూరు: మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో అంతర్గత రహదారుల అభివృద్ధికి రూ.కోటితో అంచనాలు వేశామని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ కె.విజయకుమారి తెలిపారు. పెనమలూరు జగనన్న కాలనీలో అంతర్గత రహదారులు సక్రమంగా లేవని లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకురావంతో ఆమె శుక్రవారం జగనన్న కాలనీకి వచ్చి పరిశీలించారు. ఎస్ఈ విజయకుమారి వివరాలు తెలుపుతూ రూ.15 లక్షల మండల పరిషత్ నిధులతో రోడ్డు వేశామన్నారు. మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు రూ.15 లక్షలు మంజూరు చేయటంతో రోడ్డు నిర్మాణానికి అనుమతులు కోరామన్నారు. ఇదే కాకుండా కాలనీలో ఆరు నిలువు రోడ్లు, 3 అంతర్గత అడ్డ రోడ్లు, నాలుగు కల్వర్టులు, రహదారులు అడుగున్నర మెరక చేయటానికి రూ.కోటితో అంచనాలు వేసి జిల్లా కలెక్టర్‌కు పంపామన్నారు. నిధులు మంజూరు చేయగానే అంతర్గత రహదారుల నిర్మాణం వెంటనే చేపడతామని వివరించారు. స్థానికంగా ఉన్న లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సర్పంచ్ లింగాల భాస్కరరావు, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు,

ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

పెనమలూరు:గోసాల గ్రామం వైకుంఠపురంలో నూతనంగా నిర్మిస్తున్న కనకదుర్గ అమ్మవారి ఆలయానికి భక్తురాలు శుక్రవారం రూ.50 వేలు విరాళం అందించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత మురళీ భార్య విజయ అమ్మవారి ఆలయ నిర్మాణానికి తన వంతు సాయంగా కమిటీ సభ్యులకు విరాళం అందచేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తులు ముందుకు వచ్చి అమ్మవారికి విరాళాలు ఇస్తున్నారని, త్వరలో అమ్మవారి గుడి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. పంచాయతీ వార్డు సభ్యుడు పీర్ అహ్మద్, కమిటీ సభ్యులు ఆకుల సుశీల, ఝాన్సీ, లక్ష్మి పాల్గొన్నారు.

వ్యాయామంతో మెరుగైన ఫలితాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: దివ్యాంగులకు క్రమం తప్పకుండా వ్యాయామం చేయించటం వల్ల మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఫిజియోథెరపిస్ట్ శ్యాం ప్రసాద్ అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని మెయిన్ ఎంపీపీ పాఠశాలలో గురువారం ఉచిత ఫిజియో థెరపీ క్యాంపు నిర్వహించారు. దివ్యాంగులకు వివిధరకాల వ్యాయామాలు ఎలా చేయించాలో తల్లిదండ్రులకు తర్ఫీదు ఇచ్చారు.

ఘనంగా శాకంబరీ ఉత్సవాలు



ఉయ్యూరు: శాకంబరీ ఉత్సవాలు ఉయ్యూరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శివాలయం, విజయదుర్గాభవాని దేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్లను కూరగాయలతో విశేషంగా అలకరించారు. ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు దర్శించుకుని తరించారు.

శారదచంద్రసుందరముఖీ.. శాకంబరీ..



శాకంబరిదేవిగా విజయదుర్గమ్మ



అమ్మవారికి సారె తీసుకొస్తున్న భక్తులు

- శాకంబరిదేవిగా విజయదుర్గమ్మ
- కొత్త అమ్మవారికి సారె సమర్పణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శాకంబరీ శరణు శరణు అంటూ భక్తజనం అమ్మవారిని మనసారా కొలిచారు. భీమనవారిపేటలోని శ్రీ విజయదుర్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు శాకంబరీదేవిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల పండ్లు, కాయలు, ఆకుకూరలు, కాయగూరలతో అలంకరించారు. అమ్మవారికి తెల్లవారుజామున పంచామృత అభిషేకాలు, అలంకరణ, అనంతరం విశేష కుంకుమార్చన చేశారు.

ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ అమ్మవారికి పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం 10 గంటలకు చండీ పారాయణం, అష్టోత్తర శత నామ పారాయణం జరిగాయి. అమ్మవారి సారె సమర్పణకు వచ్చిన భక్తులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం విజయదుర్గ ఆలయం నుంచి చిట్టినగర్ శ్రీమహాలక్ష్మి ఆలయానికి భక్తులు ఊరేగింపుగా వెళ్లారు. మహాలక్ష్మి అమ్మవారికి సారె సమర్పించిన అనంతరం ప్రసాదాలు స్వీకరించారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో ఆరోగ్యం



చంద్రగూడెంలో సేంద్రియ ఎరువును పరిశీలిస్తున్న ఫ్రాన్స్ విద్యార్థులు

చంద్రగూడెం(మైలవరం): ప్రకృతి వ్యవసాయం ఎంతో ఆరోగ్యకరమని ప్రకృతి వ్యవసాయ ఎన్టీఆర్ జిల్లా అధికారి విజయకుమారి తెలిపారు. మైలవరం మండలం చంద్రగూడెం, దాసుళ్లపాలెం గ్రామాలలో ఫ్రాన్స్‌కు చెందిన సోర్బోన్నే యూనివర్సిటీ స్టూడెంట్స్ శుక్రవారం పర్యటించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సాధికార సంస్థ(ఏపీఆర్‌వైఎస్ఎస్) ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రకృతి వ్యవసాయం, రైతులను కలసి వారు చేస్తున్న వ్యవసాయ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. చంద్రగూడెంలోని డి. చక్రధర్‌కు చెందిన ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ ఫీల్డ్‌ను పరిశీలించి రైతు అనుభవాలను తెలుసుకున్నారు. అదే విధంగా దాసుళ్లపాలెం గ్రామంలో రైతు రామిరెడ్డి మోడల్ ఫీల్డ్‌ను సందర్శించి ప్రకృతి వ్యవసాయం వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఫ్రాన్స్ యూనివర్సిటీ విద్యార్థులు, ఎస్ఎఫ్ఏలు, యూనిట్ లెవెల్ స్టాఫ్ పాల్గొన్నారు.

ఆర్‌బీకేలతో అన్నదాతల వద్దకు ప్రభుత్వ సేవలు



రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల(ఆర్‌బీకేలు)ను గ్రామగ్రామాన ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను రైతుల గడప వద్దకు తీసుకొచ్చిందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని బోర్వంచలో రూ.22 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రైతుల సమస్యలపై మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి గ్రామంలో రైతులకు ప్రభుత్వ సేవలను అందజేసేందుకు వ్యవసాయ, ఉద్యాన సహాయకులను నియమించారన్నారు. వీరి ద్వారా ఈ క్రాప్ బుకింగ్ చేయించడంతో పాటు రైతులకు అమలు చేసే పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరేపల్లి శిరీష, మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్ రామ్మోహన్‌రావు, ఏడీఏ విద్యాసాగర్, ఏఓ చాముండేశ్వరి, హెచ్ఓ హేమ, ఎంపీడీఓ వీఏ విజయ్‌కుమార్, తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు, సీడీపీఓ ఎస్‌వై నూరాణి పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు సబ్సిడీ రుణాలు

వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో–ఆర్డినేటర్ రాజశ్రీ



మాట్లాడుతున్న రాజశ్రీ

గంపలగూడెం: స్వయం సహాయక సంఘాలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకుంటే సబ్సిడీపై రుణ సౌకర్యం కల్పించనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో–ఆర్డినేటర్ యు.రాజశ్రీ తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథ కార్యాలయంలో శుక్రవారం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై వీఓఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 19 రకాల ముడి పదార్థాల ద్వారా ఐదేసి రకాల ఆహార ఉత్పత్తులను తయారు చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. దీనికై ఆయా ఉత్పత్తుల తయారీకి అవసరమైన రుణాలును, రూ. లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు రుణ సౌకర్యం అందిస్తామన్నారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు 35 శాతం బీసీ, ఓసీలకు 25 శాతం సబ్సిడీ లభిస్తుందన్నారు. ఉత్సాహం ఉన్న స్వయం సహాయక సంఘాల నుంచి తగిన దరఖాస్తు చేయించాలని ఆమె సూచించారు. మండలంలో 30 నుంచి 40 యూనిట్ల వరకు మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం నాగరాజు, పశువైద్యాధికారి అభిలాష్, డీఆర్పీ ఉషారాణి, వీఓఏలు పాల్గొన్నారు.

లబ్బీపేటలో మలేరియా జిల్లా లేబొరేటరీ

- ఫైలేరియా కేంద్రం కూడా ఏర్పాటు
- ఇక్కడి సబ్‌యూనిట్ కృష్ణలంకకు తరలింపు



లబ్బీపేటలో జిల్లా మలేరియా కార్యాలయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): మలేరియా జిల్లా లేబొరేటరీని లబ్బీపేట బృందావనకాలనీ నందమూరి రోడ్డులోని మలేరియా కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ జిల్లా లేబొరేటరీ మచిలీపట్నంలో ఉండేది. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ప్రతి జిల్లాకు ఒక లేబొరేటరీ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీంతో ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి లేబొరేటరీని లబ్బీపేట మలేరియా కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇప్పటి వరకూ నిర్వహించిన మలేరియా యూనిట్ 2ను కృష్ణలంక భ్రమరాంబపురానికి తరలించారు.

జీరో మలేరియా కేసులు

ప్రస్తుతం లబ్బీపేట మలేరియా యూనిట్ 2 పరిధిలో జీరో మలేరియా కేసులు ఉన్నాయి. కృష్ణలంక భ్రమరాంబపురంలో అక్కడక్కడా మలేరియా పాజిటివ్ కేసులతో పాటు, ఫాల్సీఫారమ్(పీఎఫ్) కూడా నమోదవుతుండటంతో ఆ ప్రాంతంలో మలేరియా యూనిట్ అవసరమని భావించి అక్కడికి లబ్బీపేట యూనిట్‌లు తరలించారు. అయితే ఇప్పటికే టెంపరరీ యూనిట్ నడుస్తుండగా, దానిలో ల్యాబ్ టెక్నీషియన్ ఉన్నాడు. లబ్బీపేటలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్ ఇక్కడే పనిచేసేలా ఆదేశాలు ఇవ్వనున్నట్లు జిల్లా మలేరియా అధికారి తెలిపారు.

ఫైలేరియా కేంద్రం

ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి ఫైలేరియా కేంద్రాన్ని మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతీబాబు తెలిపారు. ఇది మంజూరైతే దాన్ని లబ్బీపేట మలేరియా కార్యాలయ ప్రాంగణంలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమలు వృద్ధి చెందకుండా నగరంతో పాటు, జిల్లా అంతటా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నడిచే నట గ్రంథాలయం అక్కినేని



అక్కినేనికి శత జయంతి వేడుకల్లో చింతకాయల చిట్టిబాబు, చీదెళ్ల నాగేశ్వరరావు

విజయవాడ కల్చరల్: నడిచే నట గ్రంథాలయం సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు కొనియాడారు. అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, తెలుగు కళావాహిని, కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, శ్రీ కళాభారతి సంస్థ ఆధ్వర్యాన గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకల సన్నాహక సభ, సినీ స్వరనీరాజనం జరిగింది. చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని అక్కినేని నాగేశ్వరరావు అభిమానుల సహకారంతో శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు చీదెళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అక్కినేని పేరుతో జాతీయ పురస్కారాలను ప్రదానం చేస్తామని తెలిపారు. వివిధ రంగాలకు చెందిన నూకల నరసింహరావు, ఎస్.దుర్గాప్రసాద్‌లను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. సమావేశంలో పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు, కళాసంస్థల ప్రతినిధిలు శింగంశెట్టి పెద బ్రహ్మం, కోటవెంకటేశ్వరరెడ్డి, బీవీ వీరభద్రరావు, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు. నగారానికి చెందిన పలువురు గాయనీ గాయకులు అక్కినేని నాగేశ్వరరావు ఆలపించిన గీతాలను మధురంగా ఆలపించారు.

గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న డీవీ మోహన్‌కృష్ణ వేదికపై సుధాకర్

విజయవాడ కల్చరల్: గురు సంప్రదాయాన్ని కాపాడుకోవాలని సంగీత విద్వాంసుడు డీవీ మోహనకృష్ణ అన్నారు. స్వరఝురి సంగీత సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాన్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ 93వ జయంతి వేడుకలు, గురుశిష్య అనుబంధం- మురళితో అనుబంధం అంశంగా ముఖాముఖి కార్యక్రమం జరిగింది. మోహన కృష్ణ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయంలో గురువాసంలో శిక్షణ అనాదిగా వస్తోందని దాంతో గురు శిష్యుల అనుబధం పెరుగుతుందని ప్రతి చిన్న విషయాన్ని పర్యవేక్షించే అవకాశం కలుగుతుందన్నారు. తనకు సంగీత భిక్ష పెట్టింది మంగళంపల్లి వారేనని తల్లిలా ఆదరించారని తండ్రిగా క్రమ శిక్షణ నేర్పించారని గురువుగా శిష్యవాత్సల్యంతో ఆదరించారని చెప్పారు. సరిగమలతోపాటు జీవిత పాఠాలు నేర్పించారని అటువంటి గురువు లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

సాంస్కృతిక సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యాన

సాంస్కృతిక సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక కార్యాలయంలో ఉదయం బాలమురళీకృష్ణ 93 జయంతి వేడుకలను నిర్వహించారు డేవిడ్ రాజు మాట్లాడుతూ మంగళంపల్లి వారి పేరుతో పురస్కారం ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సీహెచ్ చిట్టిబాబు, ఎం.శ్యాంప్రసాద్, దండు చంద్రశేఖర్, ఆదిరాల జయప్రభ, ఆర్‌వై చలపతిరావు తదితరులు మంగళంపల్లి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. బాలమురళి తెలుగు సినిమాల్లో ఆలపించిన గీతాలను గాయకులు ఆలపించారు.